క్లుప్తంగా

కుంట శిఖం భూమి కాపాడాలి


ఫిర్యాదు చేస్తున్న బండారి శేఖర్

చొప్పదండి: పట్టణంలోని సర్వే నంబర్ 300లోని కుంట శిఖం భూమిని కాపాడాలని ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ సోమవారం ప్రజావాణిలో జిల్లా కమిటీ తరుపున ఫిర్యాదు చేశారు. పక్కన సర్వే నంబర్ ద్వారా కుంట శిఖం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, అక్రమ రిజిస్ట్రేషన్లు గుర్తించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ చొరవ తీసుకొని కుంట శిఖం భూమి కాపాడాలని కోరారు. తక్షణమే విచారణ జరిపి రిపోర్టు ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారని శేఖర్ తెలిపారు.

వైద్యశాలను పరిశీలించిన ఇమ్యునైజేషన్ అధికారి


వైద్యశాలను పరిశీలిస్తున్న జువిదా

రామడుగు: మండలంలోని గుండి గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జువిదా పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య మహిళా పథకానికి ఎంపిక కావడంతో వైద్యశాలలో చేపట్టాల్సిన కార్యక్రమాలను సిబ్బందితో చర్చించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'బతుకమ్మ'కు భూమిపూజ

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామ శివారులోని చిత్రకుంట వద్ద రూ.మూడు లక్షల ఎమ్మెల్యే నిధులతో చేపట్టనున్న బతుకమ్మ విగ్రహ ఏర్పాటుకు సోమవారం అధికారులు ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ మల్లేశం, ఉప సర్పంచ్ పిట్టల కుమార్, స్వామి వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు


మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్ ప్రమీల

రామడుగు: మండల కేంద్రానికి సమీపంలోని మోతె వాగు బ్రిడ్జి వద్ద రహదారి పూర్తిగా ధ్వంసంకావడంతో సోమవారం సర్పంచ్ పంజాల ప్రమీల మరమ్మతుచేయించారు. వాహనదారులు ఇబ్బందిపడుతూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి రాడంతో రోడ్డుపై మట్టిపోయించి చదును చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగన్‌మోహన్‌గౌడ్, తదితరులున్నారు.

నూతన కమిటీల ఏర్పాటుతో పార్టీ బలోపేతం

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన కమిటీలను పార్టీ అధిష్టానం ఏర్పాటు చేసిందని పీసీసీ సభ్యుడు కర్ర భగవాన్ రెడ్డి తెలిపారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతన కమిటీ సభ్యుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. పార్టీకి పూర్వ వైభవం రానుందని ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేస్తే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. హుజూరాబాద్ టౌన్ అధ్యక్షుడిగా సొల్లు బాబు, మండల అధ్యక్షుడిగా కొల్లూరి కిరణ్‌ను నియమిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. పార్టీ గెలుపు కోసం పని చేస్తామని కమిటీల నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, ఆలేటి సుశీల, ఎండీ అప్సర్, వేముల పుష్పలత, నారాయణ, సారయ్య, ఎర్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



శంకరపట్నం: రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఆముదాలపల్లికి చెందిన దొంగల రాజయ్యను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వంగ సుధాకర్ తెలిపారు. ఈకార్యక్రమంలో పమ్మిరెడ్డి, రమేశ్, సంపత్‌రావు, సదానందం, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

మూడేళ్లకు ముందడుగు

- ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల నిర్వహణకు కసరత్తు
- కరోనా నేపథ్యంలో ఆటలకు విరామం
- పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థుల ఉత్సాహం


హుజూరాబాద్ పాఠశాలలో విద్యార్థినులకు కబడ్డీలో మెలకువలు నేర్పిస్తున్న పీడీ సారయ్య

హుజూరాబాద్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే ఆటలపోటీలు మూడేళ్ల విరామం అనంతరం ప్రారంభం కాబోతున్నాయి. కరోనా మహమ్మారి నేపథ్యంలో కొంతకాలంగా క్రీడల నిర్వహణ ఆగిపోయింది. దీంతో విద్యార్థుల్లో కొంతమేర క్రీడాసక్తి తగ్గిందనే చెప్పొచ్చు. మూడేళ్ల తర్వాత నిర్వహించనున్న క్రీడలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయా పాఠశాలల్లో అండర్-14,అండర్-17 క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటితే పొందే మెరిట్ ధ్రువపత్రాలు ఉన్నత విద్య, ఉద్యోగాల ఎంపికలో ఉపకరిస్తాయి.

అండర్-14, 17 విభాగాల వారీగా ఎంపికలు

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో అండర్-14, 17 విభాగాల్లో మండల స్థాయి పోటీలు ఆయా మండల కేంద్రాల్లోని పాఠశాలల మైదానాల్లో నిర్వహించనున్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన జట్టు జిల్లా స్థాయి ఆ తర్వాత ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆడనున్నాయి. అక్కడ ప్రతిభ చూపితే రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల్లోనే పోటీలు నిర్వహించాలని ఇటీవల జరిగిన సమావేశంలో ఎస్‌జీఎఫ్ కమిటీ సూచించింది. మిగతా క్రీడలకు నేరుగా జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, షటిల్, బ్యాడ్మింటన్, చదరంగం, నెట్‌బాల్, టెన్నికాయిట్, యోగా తదితర వాటిలో ఎంపికలు నిర్వహించనున్నారు.

గేమ్స్ షెడ్యూల్ రిలీజ్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయి. మండలంలో 12 ప్రభుత్వ ఉన్నత, 12 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలున్నాయి. అండర్-14, 17 క్రీడా పోటీలను ఈ నెల 19, 20, 21వ తేదీల్లో నిర్వహించనున్నారు. బాలబాలికలకు 19న ఖోఖో, 20న కబడ్డీ, 21న వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. జిల్లా స్థాయిలో మూడు క్రీడలతో పాటు ఇతర క్రీడలకు కూడా ఎంపిక చేపడతారు. మండల విద్యాధికారి ఇటీవల ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించారు.

కబడ్డీ, ఖోఖోలో ఆసక్తి



మూడేళ్ల నుంచి క్రీడా పోటీలు లేవు. స్కూల్‌లో మాత్రమే గేమ్స్ ఆడిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో పోటీల్లో ఆసక్తి ఉంది. ప్రతిరోజు రెండు నుంచి మూడు గంటల వరకు ప్రాక్టీస్ చేస్తున్నా. ఈసారి పోటీల్లో మంచి ప్రతిభ చూపుతా.

– ఎస్. అఖిల, 8వ తరగతి, చెల్పూర్

వినియోగించుకోవాలి



విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటలి. పోటీలను ప్రతిష్టాత్మకంగా, నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తాం. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.సారయ్య, ఫిజికల్ డైరెక్టర్, హుజూరాబాద్

విద్యార్థులు పాల్గొనాలి



మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులుపాల్గొనాలి. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుంది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లా స్థాయిలో సత్తా చాటాలి.

– కేతిరి వెంకటనరసింహారెడ్డి, ఎంఈవో, హుజూరాబాద్

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ రవీందర్

చొప్పదండి: రాబోయే వినాయకచవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చొప్పదండి సీఐ జి.రవీందర్ అన్నారు. పోలీస్ స్టేషన్‌లో సోమవారం పీస్ కమిటీ సభ్యులు, మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు శాంతియుతంగా పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పడకంటి క్రిష్ణ, ఎన్నం మునీందర్, గుర్రం సమర్‌రెడ్డి, చోటు, జలీల్, తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి అమలు చేయాలి

గన్నేరువరం: గృహలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల అధ్యక్షుడు కాంతాల అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. ఈపథకం ఎన్నికల కోసం అమలు చేస్తున్నట్లు ఉందని విమర్శించారు. గన్నేరువరంలో డబుల్ ఇళ్ల నిర్మాణం చేపట్టి ఏళ్ల గడుస్తున్నా దిక్కులేదని, ఇప్పుడు ఇళ్లు కట్టుకున్నవారికి పథకం అమలు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని, బీసీబంధు కొందరికే అమలు చేసి అర్హులను విస్మరిస్తున్నారని అన్నారు. ఈసమావేశంలో మండల సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, నాయకులు గర్శకుర్తి శ్రీనివాస్, కూన మల్లయ్య, బోయిని మల్లయ్య, పిప్పల కనకయ్య, ఏడుమేకల మల్లేశం, యువజన నాయకులు మోలుగురి ఆంజనేయులు, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం


ప్రొసీసిడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. పెండింగ్ బిల్లులు త్వరలో మంజూరు చేస్తామని, తిమ్మాపూర్ మండలం జాతీయస్థాయిలో అవార్డు పొందడంలో భాగస్వాములైన అధికారులు ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్నిపంచాయతీలకు రూ.కోటి యాభైలక్షలు ప్రొసీడింగ్ కాపీలను సర్పంచ్, ఎంపీటీసీలకు అందించారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎమ్మార్వో కోడం కనకయ్య, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ గాలిగోపుర నిర్మాణానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సోమవారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కిషన్‌రావు, పూజారి మురళీధరాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రేవంత్ రెడ్డి


శుభాకాంక్షలు తెలుపుతున్న పత్తి కృష్ణారెడ్డి

తిమ్మాపూర్: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు 200 మందికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో కరీంనగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోగురి నర్సింహారెడ్డి, అల్గునూర్ నాయకుడు కాల్వ మల్లేశం, నుస్తూలాపూర్ నాయకుడు బుదారపు శ్రీనివాస్ నాయకులు దావు రాంరెడ్డి, కొత్త రాజిరెడ్డి, సతీశ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పర్శరాములు, చిన్న కొమురయ్య, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ అధ్యక్షులు ఎస్.ఎల్ గౌడ్, ఎంపీటీసీ బండారి రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి మామిడి అనిల్, జిల్లా అధికార ప్రతినిధి ఎల్కపల్లి సంపత్, సింగిల్ విండో డైరెక్టర్ గోపు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, యూత్ అధ్యక్షుడు చెన్న బోయిన రవి, నాయకులు సంపత్ రెడ్డి,అజయ్ గౌడ్ పాల్గొన్నారు.

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని స్వగృహంలో వీణవంక, జమ్మికుంట పట్టణ, మండల పార్టీ అధ్యక్షుల ఎంపిక సందర్భంగా సన్మానించారు. జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేశ్, మండల అధ్యక్షుడు పుల్లూరి సదానందం, వీణవంక మండల అధ్యక్షుడు సాహెబ్ హుస్సేన్‌కు కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపికకు సహకరించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీవోఏలకు అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యతలు


తాళం పగలగొడుతున్న కార్యదర్శి శ్రీనివాస్

మానకొండూర్: అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. అంగన్‌వాడీ కేంద్రాలు సోమవారం తెరుచుకోకపోగా సెంటర్లకు వచ్చే పిల్లలకు తప్పనిసరిగా ఫుడ్ అందించి, చదువు చెప్పాలనే నిబంధన ఉంది. దీంతో గ్రామాల్లోని వీవోఏలకు కేంద్రాల నిర్వహణ అప్పగించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రం తాళాన్ని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ పగలగొట్టి వీవోఏకు బాధ్యతలు అప్పగించారు.

శంకరపట్నం ఎంపీడీఓగా శ్రీవాణి



శంకరపట్నం: శంకరపట్నం మండలం ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎస్.శ్రీవాణి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీఓ బషీరొద్దీన్ స్థానంలో హన్మకొండ జిల్లా ఏపీడీగా పనిచేసిన శ్రీవాణి సోమవారం విధుల్లో చేరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చొప్పదండి: పట్టణంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఎస్. శ్రీవాత్సవ, జి.స్నిగ్ధ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. చొప్పదండిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 30న జగిత్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ లింగారావు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఇన్‌చార్జి మేడి శంభయ్య అభినందించారు.

పుస్తకాలు పంపిణీ



హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు సోమవారం వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఉచిత పాఠ్య పుస్తకాలు అందజేశామని కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేస్తున్నామని విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. పరీక్షల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు శతమానం భవతి అనే కార్యక్రమం ద్వారా జ్ఞాపిక, నగదు, శాలువాతో సన్మానిస్తున్నామని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న కామర్స్ విభాగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మినరసింహమూర్తి, వాణిజ్య శాస్త్ర సహాయఆచార్యులు, అకడమిక్ కో ఆర్డినేటర్ డా.జి.శ్రీనివాస్, ఐక్యూఏసీకో ఆర్డినేటర్ డా.పి.దినకర్, పూర్వ ప్రిన్సిపాల్ గొడిశాల పరమేశ్, కెరీర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ ఎస్.మధు, సీనియర్ ఉపన్యాసకురాలు ఉదయశ్రీ , రాజకుమార్, శ్యామలా దేవి, రమేశ్, డా.జి.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



జమ్మికుంట: నిజాం పాలన, జమీన్‌దారి దోపిడీపై సాయుధ రైతాంగ పోరాటం సాగిందని, జాతీయోద్యమంతో సంబంధం లేదని, బీజేపీ వక్రభాష్యం చెబుతూ సర్దార్ పటేల్ పాత్రను వక్రీకరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో సాయుధ పోరాట వారోత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. ఈ నెల 10 నుంచి తెలంగాణ విలీనమైన 17వ తేదీ వరకు వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు నిర్వహించాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. రాజకీయాల కోసం సెప్టెంబర్ 17ను బీజేపీ పావుగా వాడుకోవడం శోచనీయమన్నారు. దొడ్డి కొమురయ్య ప్రాణార్పణతో మొదలై సాయుధ రైతాంగ పోరాట ఫలితంగా హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీనమైందన్నారు. కుల, మత ప్రాంతీయ బేధాలు లేకుండా పెద్ద ఎత్తున సాగిన చారిత్రాత్మక పోరాటమని, భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం చేసిన నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జోన్ కార్యదర్శి శీలం అశోక్, జిల్లా కమిటీ సభ్యులు వెల్మారెడ్డి రాజిరెడ్డి, జక్కుల రమేశ్, బాసిర సంపత్‌రావు, దండిగారి సతీశ్, గుండేటి వాసుదేవ్, రావుల ఓదేలు, మధునయ్య, రాజేందర్, కిరణ్, కరుణాకర్, సాయి, సాగర్, కొండన్న పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



హుజూరాబాద్: పట్టణంలోని రజక వాడకు చెందిన కొలిపాక సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిర్మల, రజక సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మటూరి సాయి కృష్ణ, నాయకులు వడ్లూరి విజయ్ కుమార్, తాళ్లపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి రమేష్, కళ్ల పెల్లి రమాదేవి, పావని, కొలిపాక నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'చొప్పదండి' అభివృద్ధి బీఆర్‌ఎస్ ఘనతే

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందని, పార్టీకే ఘనత దక్కుతుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట పద్మశాలీ సంఘం భవన నిర్మాణానికి రూ.4.60 లక్షల నిధుల మంజూరు పత్రాన్ని సోమవారం సంఘం నాయకులకు బూరుగుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంఘం మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, కొండగట్టు దేవస్థానం కమిటీ సభ్యులు దాసరి రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మల్లేశం, గంగయ్య, మల్లేశం, పాపిరెడ్డి పాల్గొన్నారు. దేశరాజ్‌పల్లి గ్రామ శ్రీబీరప్ప కురుమ యువసేన అసోసియేషన్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంఘం అధ్యక్షుడు ఎముండ్ల సాగర్, గౌరవ అధ్యక్షుడు వెల్ముల మల్లేశం, ప్రధాన కార్యదర్శి బీరయ్య ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పరిధి బొల్లోనిపల్లెలో నిర్మించిన హన్‌మాన్ దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించగా హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పాల్గొన్నారు. గ్రామస్తుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నానని తెలిపారు. ఎమ్మెల్యేను సర్పంచ్ సన్నీల్ల వెంకటేశం, పంచాయతీ పాలకవర్గం సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వెంట బీఆర్‌ఎస్ ఎంపీపీ వినీత, మండలశాఖ అధ్యక్షుడు అంజయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవి, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యుడు కొంరయ్య,రైతు సమన్వయ సమితి మండల చైర్మన్ తిరుపతి, ఆయా గ్రామాల సర్పంచులు లక్ష్మణ్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, వార్డు సభ్యులు సంపత్, రేణుక, సువర్ణ, లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఆశావర్కర్ల ముందస్తు అరెస్టు


తిమ్మాపూర్: పోలీసుల అదుపులో ఆశావర్కర్లు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం వేకువజామున మూడు గంటల నుంచే హైదరాబాద్ వెల్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు నిలువరించారు. ఈసందర్భంగా ఆశ వర్కర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత మాట్లాడుతూ.. ఉదయమే పోలీసులు అరెస్టు చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టయిన వారిలో సంఘం మండలశాఖ అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి శోభ, నాయకులు అంజలి, లక్ష్మి, స్వరూప, పుష్ప, సునీత, స్రవంతి పలువురు ఉన్నారు.

తిమ్మాపూర్: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని కమిషనరేట్ ముట్టడికి వెళ్తున్న ఆశావర్కర్లను రేణికుంట టోల్‌ప్లాజా వద్ద ఎల్‌ఎండీ పోలీసులు అరెస్ట్ చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్, సారంగాపూర్, గంగాధర్, తిమ్మాపూర్ మండలాల నుంచి సూమరు 50 మంది ఆశ వర్కర్లను అదుపులోకి తీసుకొని ఎల్‌ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆశ వర్కర్లు మాట్లాడుతూ... 18 ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్నామని, కరోనా సమయంలో ఎంతో కష్టమైనా విధులు సక్రమంగా నిర్వహించామని, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతి తీసుకుని హైదరాబాద్‌కు వెళ్తుంటే అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు.

గన్నేరువరం: సమస్యల సాధనకు చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఆశావర్కర్లను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ తరలించారు. న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

సైదాపూర్: మండలంలోని ఆశావర్కర్లను సైదాపూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి మధ్యాహ్నం వదిలేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్లు హక్కుల కోసం హైదరాబాద్‌లో నిర్వహించే సభకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ధర్నా, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునే అవకాశం ఉండేదని, బంగారు తెలంగాణలో శాంతియుతంగా సమస్యలు ప్రభుత్వానికి చెప్పుకునే అవకాశం కరువైందని ఆశ వర్కర్ల సంఘం మండల నాయకురాలు ఎర్రల శ్యామల ఆవేదన వ్యక్తం చేశారు.